సాక్షి
ఖమ్మం
శుక్రవారం ၊ 13 ၊ జనవరి ၊ 2023

ప్రజలకు మేలు చేసే దేవాలయం కావాలి





సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, వేదికపై మంత్రి అజయ్‌కుమార్, సీఎస్ శాంతికుమారి, ఎంపీలు నామ నాగేశ్వరరావు, కవిత, ఎమ్మెల్యేలు వనమా, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల తదితరులు

అన్ని కలెక్టరేట్లలోకి ఎత్తయిన ఎలివేషన్ ఈ భవనం సొంతం

- త్వరలోనే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- ఇంజనీరింగ్ కాలేజీలో సమస్యలు పరిష్కరిస్తాం
- నాలుగు మున్సిపాలిటీలకు రూ.130 కోట్లు
- ఖమ్మం నుంచే బీఆర్ఎస్ కార్యాచరణ
- కొత్తగూడెం సభలో సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నూతనంగా ప్రారంభించుకున్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) ప్రజలకు మేలు చేసే దేవాలయం కావాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఏ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి లేని ఎలివేషన్ భద్రాద్రి జిల్లాకు సొంతమని ప్రశంసించారు. కలెక్టరేట్ ప్రారంభం అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు. కొత్తగూడేనికి కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, బీటీపీఎస్ ఇలా అనేకం వచ్చాయి. రాబోయే రోజుల్లో మరిన్ని వస్తాయని అన్నారు. సింగరేణి సంస్థ ఇల్లెందులో పుట్టి కొత్తగూడెం ద్వారా నలుదిశలా వ్యాపించి తెలంగాణ సిరుల పంటగా, ఉపాధి కల్పించే వనరుగా మారిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతీ ఇంచుకు నీరందించేలా సీతారామ ప్రాజెక్టు చేపట్టామన్నారు. ఇది పూర్తయితే కరువు ఉండే జూలూరుపాడు, ఎత్తులో ఉండే ఇల్లెందుకూ సాగునీరు అందివ్వడం సాధ్యమవుతుందన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు ఢోకా ఉండదన్నారు.

భారీగా నిధులు..

జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, ప్రతీ పంచాయతీకి సీఎం ప్రత్యేక నిధుల నుంచి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. జిల్లా కేంద్రంలో భాగమైన పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలకు రూ.40 కోట్ల చొప్పున, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలకు రూ. 25 కోట్ల వంతున నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

హామీల వర్షం

కొత్తగూడెంలోని మైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఇంజనీరింగ్ కాలేజీగా మార్చినా అక్కడ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయనే అంశం తన దృష్టికి వచ్చిందని, త్వరలోనే ఇంజనీరింగ్ కాలేజీకి అన్ని వసతులతో కూడిన హాస్టల్, తరగతి గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని, అధ్యాపకులను నియమిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. భద్రాచలం వద్ద గోదావరికి ఎగువ ప్రాంత గ్రామాలకు 3 ఫేజ్ విద్యుత్ రావడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందని, గత సీఎస్ సోమేశ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించగా పనులు చివరి దశకు చేరాయని తెలిపారు. జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ, కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తామని సీఎం ప్రకటించారు. వీటితో పాటు జిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఇచ్చిన వినతులపై తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇక్కడి నుంచే మొదలు..

ఉద్యమ సమయంలో తనను అరెస్టు చేసి జైలుకు తీసుకెళ్తుంటే ఖమ్మం ప్రజలే కాపాడి కడుపున పెట్టుకున్నారని సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. కమ్యూనిస్టు విప్లవాలు, రాజకీయ క్రియాశీలత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బాగా విస్తరించాయన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఒక దీపం మరో దీపాన్ని వెలిగించినట్టు, ఇక్కడి నుంచే చైతన్యం వెల్లివిరియాలని పిలుపునిచ్చారు. అందుకే దేశం మొత్తం బాగుండాలనే లక్ష్యంతో ఖమ్మం నుంచే బీఆర్ఎస్ కార్యాచరణ ప్రారంభిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, లావుడ్యా రాములునాయక్, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, బాల్క సుమన్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎంఓ సెక్రటరీ స్మితా సబర్వాల్, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పూల రవీందర్, డీసీసీబీ చైర్మన్ కె.నాగభూషణం, ఆర్అండ్‌బీ ఈఎన్సీ గణపతి రెడ్డి, నిర్మాణ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో సీఎం సభకు హాజరైన జనం

కుర్చీలో కూర్చోబెట్టి...



కలెక్టర్‌ను కుర్చీలో కూర్చోబెడుతున్న సీఎం, సీఎస్

నిర్మాణ పనులు పూర్తయి చాన్నాళ్లుగా ఎదురు చూస్తున్న కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ గురువారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో పూజలు నిర్వహించారు. కలెక్టర్ అనుదీప్‌ను కుర్చీలో కూర్చోబెట్టి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కలెక్టర్ జ్ఞాపిక అందించారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో వెళ్లి నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, విప్ రేగా కాంతారావును కుర్చీలో కూర్చోబెట్టి అభినందించారు. జిల్లా అధ్యక్షుడిగా పని చేసే అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు రేగా కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ సంస్కరణల ఫలితమే : మంత్రి పువ్వాడ

కేసీఆర్ సంస్కరణ ఫలితంగానే కొత్త జిల్లాలు, కొత్త కలెక్టరేట్‌లు వచ్చాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సులువుగా, అందరికీ ఉపయోగపడేలా జిల్లాలను కేసీఆర్ విభజించారని వెల్లడించారు. కేసీఆర్ సంకల్పం వల్లే సీతారామ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిందన్నారు. కొత్త మెడికల్ కాలేజీలు మంజూరు చేసినందుకు, పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపించబోతున్నందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో భాగమైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ప్రభుత్వ అధికారుల తరఫున హామీ ఇస్తున్నట్టు ఆమె వెల్లడించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు మాట్లాడుతూ తెలంగాణ బాపూజీ కేసీఆర్ కొత్తగూడెం రావడం సంతోషంగా ఉందన్నారు.

ఖమ్మంపైనే ఫోకస్

- బీఆర్ఎస్ సభకు 24 మందితో టీమ్
- ఆరుగురు మంత్రులకు కీలక బాధ్యతలు
- సమీప నియోజకవర్గాల నుంచి భారీ జన సమీకరణ
- సభ విజయవంతంపై ప్రత్యేక దృష్టి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీఆర్ఎస్ తొలి సభకు వేదికగా నిలవనున్న ఖమ్మంపైనే ఆ పార్టీ ఫోకస్ పెట్టింది. సభను భారీ స్థాయిలో విజయవంతం చేసేందుకు సర్వశక్తులొడ్డుతోంది. ఈ నేపథ్యాన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేతృత్వాన 24మందితో టీం ఏర్పాటైంది. ఆయనతో పాటు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మరో నలుగురు మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించారు. సభకు ఐదు రోజుల సమయమే ఉండడంతో భారీ జన సమీకరణపై ఈ బృందం దృష్టి సారించింది. సభ రోజు ఖమ్మం నలువైపులా దారులన్నీ గులాబీమయమయ్యేలా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

18 నియోజకవర్గాల నుంచి..

ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించే సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లా నుంచి జన సమీకరణపై దృష్టి సారించారు. ఈ జిల్లాల్లోని 18 నియోజకవర్గాల నుంచి సభకు తరలించేలా ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో మంత్రులు పువ్వాడ, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి ఇన్‌చార్జిలుగా మిగతా నియోజకవర్గాల టీంలు జన సమీకరణపై కసరత్తు చేస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి స్థానిక ఎమ్మెల్యేలతో పాటు మరొకరిని బాధ్యులుగా నియమించారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని సూర్యాపేట జిల్లా, గిరిజన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు మహబూబాబాద్ జిల్లా, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు డోర్నకల్, పాలకుర్తి నియోజకవర్గాల బాధ్యతలు ఇచ్చారు.

ఉమ్మడి జిల్లా నుంచి 2.50 లక్షల మంది

బీఆర్ఎస్ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 2.50 లక్షల మందిని తరలించేలా టార్గెట్ పెట్టుకున్నారు. ఇందులో ఖమ్మం, వైరా, మధిర, పాలేరు, ఇల్లెందు, సత్తుపల్లి నియోజకవర్గాల నుంచి 30 వేల చొప్పున, మిగతా నియోజవర్గాల్లో 10 నుంచి 20 వేల మందిని తరలించేందుకు నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమకు అప్పగించిన నియోజకవర్గాల్లో సంక్రాంతి లోగానే సన్నాహక సమావేశాలు ముగించుకునేలా బాధ్యులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఇక సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాలు ఖమ్మం సమీపాన ఉండటంతో.. ఇక్కడి నుంచి కూడా భారీ జనసమీకరణకు కదులుతున్నారు. అలాగే మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్‌తో పాటు ములుగు, పాలకుర్తి నియోజకవర్గాల నుంచి కూడా భారీగా జనసమీకరణపై బీఆర్ఎస్ నేతలు దృష్టి సారించారు. మొత్తంగా 18 నియోజకవర్గాల నుంచి సుమారు ఐదు లక్షల మంది మేర సభకు జన సమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బీఆర్ఎస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

కలెక్టరేట్ కళకళ!



రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)ను ఈనెల 18న ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ తేదీ సమీపిస్తుండడంతో ఏర్పాట్లు వేగంగా సాగేలా ప్రజాప్రజాతినిధులు, అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. దీంతో కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి ముందే ఇలా వాహనాలతో కళకళలాడుతోంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఘనంగా సారె ఉత్సవం

మండలంలోని రేజర్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో ప్రవచనకర్త నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య ఆధ్వర్యాన జరుగుతున్న ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు గురువారం 28వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా భక్తులందరూ ఊరేగింపుగా సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణమాచార్య మాట్లాడుతూ గోదాదేవి మానవ జాతికి ప్రతినిధి అని.. మనిషి బాగుపడడానికి తిరుప్పావై వ్రతం ద్వారా బంగారు బాటను ఏర్పాటు చేసిందని తెలిపారు. అలాంటి తల్లిని ఇంటి ఆడపడుచుగా భావించి సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని వెల్లడించారు. – సత్తుపల్లిరూరల్



గోదాదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు

బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలి

ప్రత్యేక అధికారుల సమీక్షలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్

రఘునాథపాలెం: నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం ఈనెల 18న జరగనున్న నేపథ్యాన విధులు కేటాయించిన ప్రత్యేక అధికారులు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ప్రత్యేక అధికారులతో గురువారం ఆయన నూతన కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ప్రారంభోత్సవం నాటికి కార్యాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేసుకుని ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికగుప్తా, డీఆర్వో శిరీషతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు శ్యాంప్రసాద్, వీ.వీ.అప్పారావు, పుష్పలత, ఏలూరి శ్రీనివాసరావు, టి.కిషన్‌రావు, కె.శ్రీరాం, డాక్టర్ మాలతి, జ్యోతి, అనసూయ, విజయనిర్మల, సురేందర్, రవీంద్రనాద్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ఏర్పాట్లు పరిశీలన



కంటి పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం వైద్యవిభాగం: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ఈనెల 18న ప్రారంభించనుండగా, అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈమేరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి చేరిన సామగ్రి, మండలాల వారీగా పంపిస్తున్న సామగ్రిని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ గురువారం పరిశీలించారు. కంటి అద్దాలు, స్టాండ్‌లు, టార్చిలైట్ల నాణ్యత, ఆటో రిఫ్రాక్టోమీటర్ల పనితీరు, స్క్రీనింగ్ విధానంపై ఆరా తీశారు. అంతేకాక స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. డీఎంహెచ్‌ఓ మాలతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాంబాబు, ఎంసీహెచ్ పీఓ సైదులు, ఎన్‌సీడీ పీఓ కోటిరత్నం, డాక్టర్ ప్రమీల, నీలోహన తదితరులు పాల్గొన్నారు.

హెలీప్యాడ్లు.. ఒకటి కాదు రెండు !



తాత్కాలికంగా సిద్ధం చేసిన హెలీప్యాడ్

రఘునాథపాలెం: వీ.వీ.పాలెంలో నిర్మించిన కొత్త కలెక్టరేట్ సముదాయంలో రెండు హెలీప్యాడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే తూర్పు వైపున శాశ్వత హెలీప్యాడ్ నిర్మించారు. కలెక్టరేట్‌ను ప్రారంభించనున్న 18వ తేదీన బీఆర్‌ఎస్ బహిరంగ సభ కూడా సమీపాన జరగనుంది. సీఎం కేసీఆర్‌తోపాటు ఇతర రాష్ట్రాల సీఎంలు హాజరుకానున్న నేపథ్యాన మరో హెలీప్యాడ్ తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులు చివరి దశకు చేరాయి.

శాఖల వారీగా విద్యుత్ మీటర్లు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, డీఈ

రఘునాథపాలెం: నూతన కలెక్టరేట్ సముదాయంలో శాఖల వారీగా విద్యుత్ వాడుకున్నంత మేర బిల్లులు ఆయా శాఖలే బిల్లులు చెల్లించేలా ప్రత్యేక మీటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం సముదాయానికి కలిపి 315 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పూర్తిగా కలెక్టర్ చాంబర్, కాన్ఫరెన్స్ హాళ్లు, ఇతర అవసరాలకు వినియోగించుకునేలా కనెక్షన్లు ఇచ్చారు. ఇక శాఖల వారీగా మరో 34 ఎల్‌టీ మీటర్లు ఏర్పాటు చేసి వీటికి ఇంకో 315 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించి విద్యుత్ సరఫరా చేయనున్నారు. మరోపక్క 160 కేవీ జనరేటర్ కూడా ఏర్పాటు చేశారు. కాగా, విద్యుత్ సంబంధిత పనులను ఎస్ఈ సురేందర్, డీఈ రామారావు, ఏడీ రమేష్, ఏఈ రమేష్ పర్యవేక్షిస్తున్నారు.

రూ1.80కోట్లతో ఫర్నిచర్



సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన 400 కుర్చీలు

రఘునాథపాలెం: కొత్త కలెక్టరేట్‌లోని కార్యాలయాలు, మంత్రి, కలెక్టర్, అదనపు కలెక్టర్ల చాంబర్లతో పాటు కాన్ఫరెన్స్ హాళ్లకు కొత్త ఫర్నిచర్ కొనుగోలు చేశారు. రూ.1.80 కోట్లతో కుర్చీలు, టేబుళ్లు ఇతరత్రా ఫర్నిచర్ కొనుగోలు చేయగా.. శాఖల వారీగా బిగిస్తున్నారు. మరోపక్క పాత కలెక్టరేట్ నుంచి వచ్చే కొన్ని శాఖలకు ఫర్నిచర్ అక్కడి నుంచే తెచ్చుకోవాలని సూచించారు. ఫర్నిచర్ అమర్చే పనులు ఆర్అండ్‌బీ శాఖ ద్వారా కొనసాగుతున్నాయి.

భద్రతపై పోలీసు ఉన్నతాధికారుల సమీక్ష



పోలీసు వాహనాలతో చేపట్టిన కాన్వాయ్ ట్రయల్ రన్

రఘునాథపాలెం/ఖమ్మంక్రైం: ఈనెల 18న నూతన కలెక్టరేట్ ప్రారంభం, అదే రోజు బీఆర్‌ఎస్ బహిరంగ సభ ఉండగా సీఎం కేసీఆర్‌తో పాటు ఇతర రాష్ట్రాల సీఎంలు, నేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యాన పోలీసు అధికారులు భద్రతపై దృష్టి సారించారు. వరంగల్ సీపీ రంగనాథ్, ఖమ్మం సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి గురువారం కలెక్టరేట్, బహిరంగ సభావేదికను పరిశీలించారు. అలాగే, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ఏర్పాట్లపై ఎన్టీఆర్ సర్కిల్, వరంగల్ క్రాస్‌రోడ్, కోదాడ క్రాస్‌రోడ్డు, కొదుమూరు రోడ్డు, కొణిజర్ల రోడ్లలో పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. అంతేకాకుండా కలెక్టరేట్ నుంచి బహిరంగ సభా ప్రాంగణంలోకి కాన్వాయ్ ట్రయల్ రన్ కూడా చేపట్టారు. అడిషనల్ డీసీపీలు శబరీష్, సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ పైనుంచి సభాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

పాత నుంచి కొత్తకు!



ర్యాక్‌లు, టేబుళ్లను తరలిస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)ను ఈనెల 18న తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనుండగా, అదే రోజు అక్కడి నుంచే శాఖల కార్యకలాపాలు మొదలుకానున్నాయి. దీంతో అధికార యంత్రాంగం ఇప్పటి నుంచే సామగ్రి తరలింపు ప్రారంభించింది. కలెక్టరేట్‌లో అన్ని సెక్షన్లకు సంబంధించిన కుర్చీలు, బెంచీలు, ఫైళ్లను నూతన కలెక్టరేట్‌కు తరలించారు. రెండు, మూడు రోజుల్లో సామాగ్రి తరలింపు పూర్తికానుంది. అయితే, ఇంకొన్ని శాఖల ఉద్యోగులు కూడా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

చరిత్ర కలిగిన బస్టాండ్‌కు పూర్వవైభవం

- ఇక్కడి నుంచి 250 బస్సుల రాకపోకలు
- సిటీ బస్టాండ్‌ను ప్రారంభించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పాత బస్టాండ్‌కు ఎంతో చరిత్ర ఉందని... 1978లో రెండు ఎకరాల స్థలంలో నిర్మించిన ఈ బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకొస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. పాత బస్టాండ్‌ను సిటీ బస్టాండ్‌గా తీర్చిదిద్దగా మంత్రి గురువారం ప్రారంభించి మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం వచ్చినపుడు కొత్త బస్టాండ్ ఆవశ్యకతను గుర్తించి అన్ని హంగులతో నిర్మాణం జరిగేలా నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈమేరకు ప్రజల అవసరాన్ని గుర్తించి పాత బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు రూ.50 లక్షలతో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సిటీ సర్వీసులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. కాగా, పాతబస్టాండ్ పునరుద్ధరిచడంపై స్థానిక వ్యాపారులు, ప్రయాణికులు మంత్రిని సత్కరించారు.

250 బస్సులతో సిటీ బస్టాండ్

ప్రస్తుతం అవసరాలకు అనుగుణంగా సిటీ బస్టాండ్ నుంచి 250 బస్సుల రాకపోకలు జరగనున్నాయని మంత్రి పువ్వాడ తెలిపారు. రవాణాశాఖ మంత్రిగా తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి డిపోలను లాభాల బాటలోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. కాగా, ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడు కిలోమీటర్లు ఉన్న ఖమ్మం నగరాన్ని 15 కిలోమీటర్లకు విస్తరించిన ఘనత మంత్రి పువ్వాడకే దక్కుతుందని వెల్లడించారు. కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, సుడా, డీసీసీబీ చైర్మన్లు బచ్చు విజయ్‌కుమార్, కూరాకుల నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్టీసీ కరీంనగర్ ఈడీ వీర్ల వెంకటేశ్వర్లు, ఆర్ఎం ప్రభులత, డీఎం శ్రీనివాసరావు, సీఐ రామయ్యతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, కమర్తపు మురళి, పగడాల నాగరాజు, గుండాల కృష్ణ, ఎం.డీ.తాజుద్దీన్, నజీముద్దీన్, షకీనా తదితరులు పాల్గొన్నారు. కాగా, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సిటీ బస్టాండ్‌లో జన తెలంగాణ యూత్ క్లబ్‌ను మంత్రి పువ్వాడ ప్రారంభించగా, డీసీఎంఎస్ డైరెక్టర్ జక్కుల లక్ష్మయ్యతోపాటు జక్కుల వెంకటరమణ, కందాల శివాజీ, వెంకటప్రసాద్, కంబాల సాయికిరణ్, రేగళ్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.



సిటీ బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అజయ్‌కుమార్

ఆలయాల్లో ఎండోమెంట్ ఏసీ పూజలు

ఖమ్మం గాంధీచౌక్/భద్రాచలం/పాల్వంచ రూరల్/కొత్తగూడెం టౌన్: ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి, ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఏ.సులోచన, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి గురువారం పూజలు చేశారు. భద్రాచలం ఆలయంలో లడ్డూల అంశంపై విచారణ వచ్చిన వారు తొలుత ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, పాల్వంచ మండల పరిధి పెద్దమ్మతల్లి ఆలయం, కొత్తగూడెంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం(గణేష్‌టెంపుల్)ను కూడా సందర్శించారు. ఆతర్వాత భద్రాచలంలో రామాలయాన్ని సందర్శించి అంతరాలయంలో మూలమూర్తులు, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈమేరకు ఆలయాల్లో ఈఓలు, అర్చకులు వారికి స్వాగతం పలికి దర్శనం చేయించాక జ్ఞాపికలు, ప్రసాదాలు అందజేశారు. ఆయా ఆలయాల ఈఓలు శివాజీ, ఎస్.రజనీకుమారి, ఏ.జగన్మోహన్‌రావు, కె.సులోచనతో పాటు అర్చక, ఉద్యోగులు గౌరీశంకర్, సమత, ఆనంద్, పి.బెల్‌సింగ్, మునగలేటి భార్గవాచార్యులు, అన్నవజ్జల ప్రసాద్‌శర్మ, రాధాకృష్ణశాస్త్రి, జానకీరామశర్మ, శ్రీనివాసాచారి, కృష్ణప్రసాదశర్మ, అవధానుల సీతారామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం స్తంభాద్రి ఆలయంలో అధికారులకు వేదాశీర్వచనం అందచేస్తున్న అర్చకులు

తెలుగు రాష్ట్రాల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ కరుణాకర్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండలం గౌరిగూడెంలో ఎంఆర్ హబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఏపీ, తెలంగాణ నుంచి 120 జట్లు హాజరుకాగా, పోటీలను సత్తుపల్లి టౌన్ సీఐ టి.కరుణాకర్ ప్రారంభించారు. కాగా, మెన్స్ డబుల్స్, అండర్–15, 19 బాలుర డబుల్స్, సింగిల్స్ విభాగాల్లో నిర్వహిస్తున్న పోటీలకు నెల్లూరు, చిలకలూరిపేటకు చెందిన అంపైర్లు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు, సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డితో పాటు మందపాటి శ్రీనివాసరెడ్డి, బండి చెన్నకేశవరెడ్డి, బండి సతీష్‌రెడ్డి, వనమారెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు చేరిన శ్రీలంక జట్టు



క్రికెటర్లతో పీడీ వెంకన్న, ఎం.డీ.మతిన్

ఖమ్మం స్పోర్ట్స్: ఆల్ ఇండియా ఖమ్మం ప్రీమియర్ లీగ్(కేపీఎల్) క్రికెట్ టోర్నీ రెండో సెమీస్ గురువారం జరగగా విజయం సాధించిన శ్రీలంక జట్టు ఫైనల్స్‌కు చేరింది. శ్రీలంక –ఖమ్మం ప్రీమియర్ లీగ్(కేపీఎల్) జట్ల జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టు నిర్ణీత ఇరవై ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. ఆతర్వాత బరిలోకి దిగిన కేపీఎల్ జట్టు 13.5 ఓవర్లకే ఆల్ ఔట్ కావడంతో శ్రీలంక జట్టు విజయం సాధించి ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. కాగా, శుక్రవారం ఫైనల్స్ జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.వెంకన్న, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్, టోర్నీ డైరెక్టర్ సందీప్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ సభ్యులు నైపుణ్యం పెంచుకోవాలి

కారేపల్లి: మత్స్య సహకార సంఘాల్లోని సభ్యులు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామి సూచించారు. మండలంలోని మాణిక్యారంలో నూతన సభ్యులకు చేపలు పట్టడంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజనులతో మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేయించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు సభ్యులు ఈత, వల వేయడంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా రంగారావుతో పాటు ధరావత్ బద్దూలాల్, భూక్యా పిచ్యా, ధరావత్ వికాస్, భూక్యా వాచ్యా, జైత్యా, భూక్యా కోటయ్య, ధరావత్ శ్రీను, భూక్యా కిరణ్, రమేష్, కునుసోత్ వెంకట్రాం, అజ్మీరా సంజీవవర్మ, ధరావత్ ఉమ, భూక్యా పాపా, హరి, గణేష్ పాల్గొన్నారు.



సభ్యులకు శిక్షణ ఇస్తున్న ఏడీ

వివేకానందుడి బోధనలు అనుసరణీయం

- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: స్వామి వివేకానందుడి బోధనలు అనుసరణీయమని.. ఆయన స్ఫూర్తిగా యువత దేశాభివృద్ధికి కృషి చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచించారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని సత్తుపల్లిలోని ఆయన కాంస్య విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వివేకానంద స్ఫూర్తిని యువతకు చేరువ చేసేందుకు రూ.30 లక్షలతో భవన నిర్మాణం, లైబ్రరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాతతో పాటు ఉడతనేని అప్పారావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, చీకటి శ్రీనివాసరావు, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు సూపర్‌లగ్జరీ బస్సులు ప్రారంభం

సత్తుపల్లి డిపోకు కేటాయించిన రెండు సూపర్‌లగ్జరీ బస్సులను డీఎం రాజ్యలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే సండ్ర ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం డిపోకు ఇప్పటికే పది కొత్త బస్సులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

నేడు మంత్రి హరీశ్‌రావు రాక

ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని శుక్రవారం సత్తుపల్లిలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటవీరయ్య తెలిపారు. పట్టణంలోని కొత్తూరు ఉమామహేశ్వరరావు తోటలో జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొంటారని చెప్పారు.



వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సండ్ర, తదితరులు

పెద్దాస్పత్రి ఘటనపై కమిషనర్ విచారణ

- తాజాగా మహిళ మృతి.. రెండు రోజుల పాటు ఆందోళనలు
- ఆపరేషన్ చేసిన వైద్యుడిపై వేటు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ఆస్పత్రికి ముక్కు శస్త్రచికిత్స కోసం రాగా ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందిన ఘటనపై వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ విచారణ చేపట్టారు. జిల్లా ఆస్పత్రిలో అధికారులు, సిబ్బందిని గురువారం విచారించారు. పెద్దాస్పత్రిలో గత మంగళవారం పుట్టకోటకు చెందిన వెంకటలక్ష్మి మృతి చెందగా, బుధ, గురువరాల్లో ఆమె కుటంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. అంతేకాక ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లుపై చేయి చేసుకున్నారు. దీంతో పరిస్థితులు విషమించగా, కలెక్టర్ వద్ద చర్చల్లో ఆమె కుటుంబానికి నష్టపరిహారం చెల్లించేందుకు ఒప్పుకున్నారు. అయితే, జిల్లా స్థాయి అధికారిపై చేయి చేసుకోవడాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోగా... వైద్యవిధాన పరిషత్ కమిషనర్ విచారణ చేపట్టారు.

వైద్యుడు బాబుజాన్‌పై వేటు

కమిషనర్ అజయ్‌కుమార్ చేపట్టిన విచారణలో వెంకటలక్ష్మికి ఆపరేషన్ చేసిన బాబుజాన్ తప్పు ఉన్నట్లు తేలిందని సమాచారం. దీంతో ఆయనను విధుల నుండి తొలగించారు. అనంతరం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కమిషనర్ విలేకరులతో మాట్లాడారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టామని, మహిళ మృతికి వైద్యుడిపై తప్పని తేలిందని చెప్పారు. ఈవిషయంలో సమగ్ర నివేదికను హెల్త్ సెక్రటరీకి నివేదిస్తానని తెలిపారు. కాగా, ఆస్పత్రిలో పేషంట్ల వద్ద నుండి కొందరు డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని.. ఇకనైనా తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసమావేశంలో వైద్య విధాన పరిషత్ జాయింట్ కమిషనర్ రమేష్‌బాబు, జాయింట్ డైరెక్టర్ వినయ్‌కుమార్, సీసీ యూనస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విచారణ వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ అజయ్‌కుమార్

పెద్దాస్పత్రిలో వైద్యుల ధర్నా

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది గురువారం విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లుపై దాడి చేయడం గర్హనీయమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతీ విషయాన్ని పెద్దది చేస్తూ దాడులకు దిగడం సాధారణమైందని, ఈ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవడమేకాక తమకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు, టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్ హసన్, ఆర్‌వీఎస్.సాగర్, ఐఎంఏ అధ్యక్షుడు బాగం కిషన్‌తోపాటు నందగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వైద్యులు, సిబ్బంది

అభ్యుదయ రచనల అవసరం ఉంది..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యాన అభ్యుదయ రచనల రావాల్సిన అవసరముందని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్‌రావు అన్నారు. సంఘం ఖమ్మం జిల్లా సమావేశం గురువారం సీపీఐ కార్యాలయంలో పోటు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సుదర్శన్‌రావు మాట్లాడుతూ సమాజగతిని మార్చగలిగే బలమైన ఆయుధం సాహిత్యమని తెలిపారు. ఒకప్పుడు అభ్యుదయ రచనలు సమాజాన్ని చైతన్య పరిచాయని, ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచాయని, ఇప్పుడు కాస్త వెనుకబడినందున పురోగమించాల్సిన అవసరముందని చెప్పారు. ఈ సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం, సీపీఐ నాయకులు వీరస్వామి, నిధి, సత్యనారాయణ, లెనిన్, శ్రీనివాస్, కాంతేశ్వరరావు, రెంటాల చిన్న హుస్సేన్, గోవింద్, జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు పాల్గొనగా, పీఎస్ఎం కళాకారుడు రాము ఆలపించిన గీతాలు ఆలోచింపచేశాయి.



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

నాలుగు ట్రాక్టర్లు మాయం

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో షోరూం నుండి నాలుగు ట్రాక్టర్లు మాయమయ్యాయి. ఖానాపురానికి చెందిన రాజేష్‌కుమార్ కొంతకాలం క్రితం శ్రీనాథ్‌కు చెందిన ఇల్లు అద్దెకు తీసుకుని షోరూం ఏర్పాటుచేశారు. అయితే నష్టం రాగా ఖాళీ చేస్తానని చెప్పి, వేరే వాళ్లకు ఇల్లు చూపించేందుకు గాను షోరూంలో నాలుగు ట్రాక్టర్లు ఉన్నా కూడా శ్రీనాథ్‌కు తాళాలు ఇచ్చాడు. రెండు రోజుల తర్వాత వచ్చి చూస్తే ట్రాక్టర్లు కనిపించలేదు. దీంతో శ్రీనాథ్‌పై అనుమానం ఉందని చెబుతూ రాజేష్‌కుమార్ గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

కేయూ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ తరపున ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే జట్టును గురువారం ఎంపిక చేశారు. ఖమ్మంలోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఎంపిక పోటీలు జరగగా, ఈ జట్టు కర్ణాటక రాష్ట్రం మంగళూరులో జరిగే టోర్నీలో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ సీహెచ్.రవికుమార్ తెలిపారు. కాగా, జట్టుకు కోచ్‌గా మధు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

తెలంగాణ ఇన్‌చార్జ్‌ను కలిసిన జిల్లా నేతలు



రాక్రేతో పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్‌గా నియమితులై హైదరాబాద్‌కు వచ్చిన మాణిక్‌రావు ఠాక్రే జిల్లా కాంగ్రెస్ నాయకులు గురువారం కలిశారు. పార్టీ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ ఆయనను కలిసి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షాన సత్కరించారు. నాయకులు వడ్డె నారాయణ, రాంరెడ్డి గోపాలరెడ్డి, వెంకట ప్రవీణ్‌కుమార్ నాయక్, మద్ది వీరారెడ్డి పాల్గొన్నారు.

రూ.100కోసం ఘర్షణ

రఘునాథపాలెం: మండలం కోటపాడులో ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఘర్షణ పడ్డారు. గ్రామానికి చెందిన తేళ్లూరి రమేష్, బలవంతపు నాని నడుమ రూ.100 విషయమై వాదన మొదలైంది. చివరకు గొడవ పెరగడంతో రమేష్‌పై నాని కత్తితో దాడిచేయగా గాయాలయ్యాయి. ఇదేఘటనలో నాని కూడా గాయపడగా ఇద్దరిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్ కింగ్


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

> దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్



* మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.
* పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!
* గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జెడ్ పవర్: డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ ధర: ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు బ్యాటరీ: 270 ఎంఏహెచ్ రిజల్యూషన్: 368×448 పిక్సెల్స్ బ్యాటరీ: 270 ఎంఏహెచ్ మోడ్స్: 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) కలర్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
వోఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబీ 4జీబీ ర్యామ్ 128జీబీ 6జీబీ ర్యామ్ 256జీబీ 8జీబీ ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

- దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

* చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.
* బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.
* ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంటతడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడ దని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.
* ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.